# ఆరాధన

సూర్య

## అమృతవాక్కులు

- మన అత్యున్నతికి తోడ్పడేది ధర్మం. అధోగతికి తీసుకుపోయేది అధర్మం.
- మనిషి పరిపూర్ణత ఆస్తులలో కాదు. స్వభావంలో ఉంటుంది.
- మనల్ని క్రూరులుగా మార్చేది మతమే. అత్యంత మృదువుగా మార్చేదీ మతమే.
- మానవుడు ఎంత గొప్పవాడయితే అంత కఠినమైన పరీక్షలను దాటవలసి ఉంటుంది.



# పంచాంగ శ్రవణ ప్రయోజనం

చాంద్రమానం ప్రకారం చైత్రశుద్ధ పౌడ్యమి నాడు సంవత్సర ప్రారంభ సూచకంగా మనం ఎంతో ఆనందంగా ఉగాది పండుగను జరుపుకుంటున్నాం. అసలు మనం ఉగాది రోజున పాటించాల్సిన ధర్మాలు.. విధాలు మన పూర్వ ధర్మశాస్త్రవేత్తలు ఎన్నడో నిర్ణయించారు. అందులోనే 'అభ్యంగన స్నానం... వేపపూవు పచ్చడిని భక్షించటం... పంచాంగ శ్రవణం అనేవి ప్రధాన లక్ష్యాలు. ఈ అభ్యంగనస్నానం వల్ల శరీరదోషాలు నివారించబడతాయి. వేప ప్రసాదం తినడం వల్ల అంతర్గతంగా వున్న దోషాలు నివారించబడతాయి. మరి చివరిది ముఖ్యమైన ది అయిన 'పంచాంగ శ్రవణం' మాత్రం వార్షిక ప్రణాళికగా ప్రత్యేకంగా కేటాయించబడినది.

అసలు చాంద్రమాన పద్ధతిలో గణించిన ఆ ఏడాదిని పరిస్థితుల ఆధారంగా ఆ సంవత్సరం ఎలా గడపాలో నిర్ణయించేది పంచాంగం. ఒక విధంగా ఇది 'ఇయర్ ప్లాన్' వంటిది.

పంచాంగంలో విశేషాలు తెలుసుకుంటున్నప్పుడు రెండు ప్రణాళికలు అవసరం.

1. దేశానికి సంబంధించి తీసుకోవలసిన నిర్ణయాలు
2. వ్యక్తిగతంగా తెలుసుకోవవలసినది... దానిని బట్టి తీసుకునే నిర్ణయాలు

నవనాయకుల నిర్ణయం (రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి.... మొదలైన వారి గురించి, తెలుసుకొని వ్యక్తి తన పరిధి, ఆదాయం, ఉద్యోగ, వ్యవసాయ వ్యవహారాలను-జీవనోపాధిని దృష్టి లో ఉంచుకొని, వర్షాదుల విశేషాల ద్వారా పంటలు ఎలా పండించుకోవాలి? అంటే అవసరమైన ధాన్యాలు పండించడమో... కొని దాచుకోవడమో జాగ్రత్త పడటం అవసరం. చిట్స్, షేర్స్, బంగారం మొదలైనవి కొనడానికి అనువైన కాలాలు నిర్ణయించుకోవడం... త్వరపడి నిర్ణయాలు తీసుకోకుండా జాతీయ ఆదాయాన్ని పెంచే దిశలో తమ ఆలోచనలు వృద్ధి చేసుకోవడం అవసరం.

ఇంక వ్యక్తిగతమైన నిర్ణయాలు అసలు ఆ సంవత్సరం తన ఆదాయం, వ్యయం, తెలుసుకొని గోచా రరీత్యా ఎంత అనుకూలంగా వుంది? ఏ గ్రహం వల్ల అనుకూలత వుంది? ఏ గ్రహం ప్రతికూల ఫలితాలనిస్తుంది? ఆ సంవత్సరంలో ఏయే మాసాల్లో, ఏయే రోజుల్లో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకో వాలి? అసలు, వివాహాది, శుభకార్యాలకు అనుకూలంగా వుందా? లేదా గ్రహస్థితి, ఏ విధంగా తాను జాగ్రత్తలు తీసుకొని ప్రవర్తించాలి? అని తెలుసుకోవడానికి వుపయోగపడుతుంది.

ఈ సంవత్సరంలో వచ్చే మార్పులకు శరీరాన్ని, మనస్సును అన్ని విధాల అనుకూలంగా మార్చుకోవడానికి చేసే ప్రయత్నం ఒకవైపు, ఒక వేళ గ్రహస్థితి వ్యక్తిగతంగా తనకి అనుకూలంగా వున్నట్లయి తే మంచి కార్యక్రమాలు నిర్వహించడానికి తక్కువ శ్రమతో నిరాటంకంగా, నిర్విరామంగా చేసే ప్ర యత్నం ఇంకోవైపు వుంటే వ్యక్తి తొందరగా అభివృద్ధి సాధిస్తారు.

ఇలాంటి విషయాలు తెలుసుకోవడమే అసలు పంచాంగ శ్రవణం ప్రధాన ఉద్దేశ్యం. మంచి చెడ్డ లు తెలుసుకొని ఈ సంవత్సరంలో దానికి తగ్గ జాగ్రత్తలు తెలుసుకొని మరీ అడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

సంవత్సరం ప్రారంభం నాడే ఈ విషయాలు తెలుసుకోవడం వల్ల ఈ సంవత్సరాన్ని సరిగ్గా ప్లాన్ చేసుకొని సంవత్సరాన్ని సరిగ్గా వుపయోగించుకొని తమ లక్ష్యాలను వృద్ధి పరచుకొని ఆనందకర మైన జీవితాన్ని పొందే అవకాశం వుంది. అందుకే ఇయర్‌ప్లానే(వార్షిక ప్రణాళికే) మనకి పంచాంగ శ్రవణ లక్ష్యం అని అందరూ గుర్తించాలి.

అంతేకాకుండా

"కన్యావనీ కాంచన దిగ్గ పౌనాంగనాం
సహస్రం సతతం ద్విజేభ్యః
దీత్వాఫలం యలభతే మానుష్యః
తత్ర తృలాన్యబ్ధి ఫల విశ్వణ్యన్"

దీని అర్థము:

కన్య, భూమి, బంగారం ఏనుగులు, గోవులు మొదలగు వాటిని వేయింటిని ఉత్తములైన వారిని దానం చేసినంత ఫలం పంచాంగ శ్రవణం వల్ల కలుగుతుంది.

పంచాంగ శ్రవణం వల్ల తిథి, సంపదను, వారం వల్ల ఆయుష్షు, నక్షత్రం వల్ల పాపహరం, యోగం వల్ల వ్యాధి నివృత్తి, కరణం వల్ల కార్యానుకూలత జరుగుతాయి.

పంచాంగశ్రవణం చేసిన వారికి సూర్యభగవానుడు శౌర్యాన్ని చంద్రుడు ఇం ద్రసమాన వైభవాన్ని, గురుడు-సంపదను, కుజుడు-శుభాన్ని, బుధుడు-బుద్ధిని, కుజుడు- సుఖాన్ని, శని- ఐశ్వర్యాన్ని, రాహువు- బాహు బలాన్ని, కేతువు-కులాధిక్యాన్ని కలిగిస్తారు.

అంతేకాక

" ఆయుర్వృద్ధిం పుత్ర పౌత్రభివృద్ధిన్
నిత్యారోగ్యం సంపదం చాన పాయిమ్
అచ్చిన్న నాముత్య వానామ వాప్తిం
యత్యం త్యేతే వత్సరాదీశ ముఖ్యః"

ఆయుర్వృద్ధి, పుత్రపౌత్రాభివృద్ధి, ఆరోగ్యాన్ని, సంపదను, కళ్యాణమహోత్సవాలను ఈ సంవత్సరం అధిపతులైన అన్ని గ్రహాలు ఇవ్వాలి!

అంటే పంచాంగం వల్ల సంపద, శ్రేయస్సు, శత్రు నాశనం, చెడ్డ స్వప్నాల వల్ల కలిగే ఇబ్బందులు తొలగడం, గంగాస్నాన ఫలం, శోధనపుణ్యం, ఆయుష్షు పెరగడం, సంతానాభివృద్ధి అనే అంశాలు కలుగుతాయి.

మంచి కాలంలో మంచి పనులు చేయడం, చెడ్డకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే నిత్యం ఆనందం కలుగుతుంది. అలాగే అవసరానుకూలమైన దానాదులు చేయడం వల్ల పుణ్యం పెరిగి మో క్షం పొందడం జరుగుతుంది. అనే విశేషాలు ఈ క్రింది శ్లోకం ద్వారా తెలుస్తుంది.

" శ్రీ కల్యాణ గుణావహం రిపుహరం దుస్స్వప్నదోషారుహం
గంగాస్నాన విశేష పుణ్యఫలదం గోదాన తుల్యం నృణాం
ఆయుర్వర్ధన ముత్తమం శుభకరం సంతాన సంపత్ప్రాదం
నానాకర్మ సుసాధనం సముచితం పంచాంగ మాకర్ణ్యతాం".

"జ్యోతిష రత్నాకర... జ్యోతిష చూడామణి
డా॥ ఈడ్పుగంటి పద్మజారాణి.
ఫోన్: 8143383814





భారతీయ జీవన విధానంలో అనివార్యమైన భాగంగా కొనసాగుతున్న పండుగల్లో తొలి పండుగైన ఉగాది మన సనాతన సంస్కృతిని చాటుతూ వసంత ఋతు శోభతో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొన్నది. ఉగాది అనేపేరు యుగాది నుంచి వచ్చినది. సంస్కృత పదమైన యుగాదినే తెలుగులో ఉగాది అంటారు.

# ఉగాది

> చైత్రశుక్ల నమారంభే
> జగతాం జగదీశ్వర:
> నర్వం చక్రే తదరాజన్!
> తతస్మిన్ నదాదిశే

చక్కని అందచందాలతో ఈ సువిశాలమైన సుందర విశ్వాన్ని సృజించిన విధాత ఈ రోజునే సర్వప్రాణుల సృష్టిని ఆరంభం చేశాడంటారు. యుగాలన్నింటికి అది సమయము.. సంగమ యుగము. సంగమ యుగమే సత్యమైన ఉగాది. ఈ సంగమ యుగంలోనే పరమాత్ముడు అవతరించి జ్ఞానమనే ప్రకాశంతో అజ్ఞాన అంధకారాన్ని దూరం చేసి జగత్తునంతా (మానవులందరినీ) మేల్కొల్పుతారు. నూతన చైతన్యానికి ఇది పునాది. శుక్ల పక్షంలో ఒక రేఖవలె నున్న చంద్రుడు వృద్ధి చెందుతూ నిండు చంద్రుడవుతాడు. ఒక రేఖవలె ఉన్న మానవాత్మల గుణాలను, కళలను నిండు పున్నమి చంద్రుని వలె (స్వచ్ఛంగా, శీతలంగా) 16 కళా సంపూర్ణులు, సర్వ గుణ సంపన్నులుగా ఆత్మలను పరిమపిత శివపరమాత్మ తయారుచేస్తారు. శుక్లం అంటే తెలుపు (పవిత్రం) అపవిత్రమైన ఆత్మలు ఏ జ్ఞాన సాగరుడైనా శివబాబా ఇచ్చిన జ్ఞానాన్ని జీవితంలో ఆచరిస్తే పవిత్రమౌతాయి.

సృష్టికర్తయైన బ్రహ్మ ఈ జగత్తును చైత్రమాస శుక్ల పక్షంలో మొదటి రోజున సూర్యోదయ వేళలో సృష్టించాడని పూర్వీకులు విశ్వసిస్తారు. సంగమ యుగం ఈ సృష్టికి అమృత వేళ (బ్రహ్మీముహూర్తం) లాంటిది. ఈ సమయంలోనే సృష్టికర్తయైన శివపరమాత్మ అవతరించి బ్రహ్మ ద్వారా బ్రాహ్మణులను సృజిస్తాడు. బ్రాహ్మణులే రానున్న సత్యయుగీ స్వర్గ రాజ్య భాగ్యలను దేవీదేవతలై పరిపాలిస్తారు. వసంత ఋతువు ప్రారంభంతో ఉగాది ప్రకృతిలో చైతన్యం నింపుతుంది. శిశిర ఋతువులో ఆకులన్నీ రాలిన తరువాత వసంత ఋతువు ప్రారంభంతో ఉగాది ప్రకృతిలో చైతన్యం నింపుతుంది. శిశిర ఋతువులో ఆకులన్నీ రాలి న తరువాత వసంత ఋతువు గమనంతో ప్రకృతికాంత పులకించి కొత్తదనాన్ని సంతరించుకుంటుంది. చెట్లు చిగురించి లేలేత చిగుళ్ళతో సువాసనలు వెదజల్లుతూ ప్రకృతి శోభను ఇనుమడింపజేస్తే కోయిలలు నూతనోత్సాహంతో చక్కని మధుర గీతాలాపనలతో స్వాగతం పలుకుతాయి. తుమ్మెదలు ప్రతి పూవునూ స్పృశిస్తూమదువును గ్రోలిఝుంకార నాదంతో నినదిస్తాయి.

ద్వాపర, కలియుగాలలో ఆకులు రాలిపోయినట్లు ఆత్మలతో వున్న సద్గుణాలు, శక్తులు, కళలన్నీ కోల్పోయి నిరాశ, నిస్పృహలు కమ్ముకున్నాయి. సంగమయుగం రావడంతో కొంగ్రొత్త ఆశలు ఆత్మలలో చిగురిస్తాయి. శివపరమాత్మ బ్రహ్మతనువునందు ప్రవేశించి ఆత్మల కోసం స్వర్గమనే కానుకను తెస్తారు. మీరే దేవీ దేవతులగా దివ్యగుణాతో నిండుగా వుండేవారు గనుక ఇప్పుడు ఆ విధంగా తయారవుతున్నారనే ఆశను జీవితంలో నింపారు. కాకి, కోయిలలు ఒకే గూటిలో వున్నా కానీ వసంత ఋతువు రావడంతో కోయిల కూస్తుంది కాని కాకి అరవదు. అలాగే దేవీ దేవతలుగా రానున్న భవిష్యత్తులో తయారయ్యే వారే ఈ సంగమ యుగంలోకి వచ్చి బ్రహ్మ ముఖావంశావళిగా అవుతారు. శివబాబా మధుర మహా వాక్యాలను తమ జీవితంలో ధారణ చేయాలి. సర్వులకు శివుని సందేశం ఇదే! పరమాత్మ పిల్లలైన వారు తుమ్మెదల వలె ప్రతి వ్యక్తిలోని సద్గుణాలనే స్వీకరిస్తూ ఉంటారు. ఉగాది పచ్చడి వివిధ రుచులను అనుభూతి చేయిస్తుంది. జీవితంలో ఒడుదుడుకులు, లాభానష్టాలు, కష్టసుఖాలు, నిందాస్తుతులు, తీపిగుర్తులు, చేదు అనుభవాలతో సమతుల్యంగా వుండాలనేదే దీని నుండి గ్రహించుకోవలసిన విషయం. మామిడాకుల తోరణాలు శుభానికి గుర్తు. ఇవి వాతావరణాన్ని శుద్ధి చేస్తాయి. ఆకులను వేదాలతో పోలుస్తారు సర్వవేద శాస్త్రాల సారాన్ని శివబాబా బ్రహ్మముఖారవిందం ద్వారా తెలియచేశారు. శుభప్రదమైన ఆలోచనలు, శుద్ధ సంకల్పాలతో వాతావరణాన్ని తయారు చేయాలి. శ్రేష్ఠ భావన ద్వారా వాతావరణంలో మంచి వైబ్రేషన్లు వ్యాపింప చేయాలి. సూర్యచంద్ర, గురు గ్రహాలకు కొన్ని నక్షత్రాలతో సంబంధం ఏర్పడినప్పుడు ఉగాదులు వస్తాయని విష్ణుపురాణం చెబుతుంది. జ్ఞాన సూర్యుడైన శివబాబా, జ్ఞాన చంద్రుడైన బ్రహ్మాబాబా నక్షత్రాలైన ఆత్మలు కల్పానికి ఆది సమయమైన ఈ సంగమయుగపు ఉగాదిలోనే కలుసుకుంటారు. సంబంధం ఉందని తెలిసేది. కేవలం సంగమయుగంలోనే.

ఈ ఉగాదిలో పవిత్ర స్నానాలు ఆచరించి దైవాన్ని ఆరాధించి, దాన ధర్మాలతో తరించాలని మహాభారతం సూచిస్తుంది. ఈ సంగమయుగంలో ఆత్మను పవిత్రం చేసే జ్ఞానస్నానము ప్రతిరోజూ చేయాలి. దేవాధిదేవుడు. సర్వశక్తి వంతుడైన శివబాబాను గుర్తుచేసి ఆత్మాభిమానంలో వుంటూ జ్ఞాన రత్నాలను దానం చేసినపుడే సత్యయుగ సృష్టిలో ఉన్నతమైన పదవిని అలంకరిస్తారు. పండితులు ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేస్తారు. రాబోయే ప్రపంచము గురించి, సృష్టి ఆదిమధ్యాంతముల జ్ఞానమును, భూత - భవిష్యత్- వర్తమాన కాలాదులు, మూడు లోకాలు, కర్మల గుణ్యగతి, ఆత్మ-పరమాత్మల గురించిన స్పష్టము, సత్యమైన జ్ఞానయాపనులకు నియోగించిన నాటినుంచి ఇది సంవత్సరాది అయిందని బ్రహ్మాండపురాణ వాక్యము.

**శివభాగవానువాచ:**

సంగమయుగమే కాల్పానికి సత్యమైన యుగాది
యుగపురుషుడైనన బ్రహ్మయే ఆదిపిత.



- దాదీ జానకి
బ్రహ్మకుమారీస్ అధినేత్రి

# తలీతాకుమీ



యేసు క్రీస్తు ప్రభువు మృతులను లేపిన అద్భుతములలో ఇది మొదటిది. యాయిరు సమాజ మందిరపు అధికారులలో ఒకడు. అతనికి పన్నెండేండ్ల వయస్సు గల ఒక కుమార్తె యుండెను. యాయిరు వచ్చి, ప్రభువు పాదముల మీదపడి- నా చిన్న కుమార్తె చావనై యున్నది అది బాగుపడి బ్రదుకునట్లు నీవు వచ్చి దాని మీద నీ చేతులుంచవలెనని ఆయనను మిగుల బ్రతిమాలుకొనెను (మార్కు 5:22-24,లూకా 8:41-42). యాయిరుకు ఆ చిన్నది ఒక్కతే కుమార్తె (లూకా 8:41-42).

యాయిరు ప్రభువును బ్రతిమాలుతుండగా మధ్యలో పన్నెండేండ్ల నుండి రక్త స్రావమే గల స్త్రీ ప్రభువు వస్త్రమును ముట్టుగా ఆ స్త్రీని స్వస్థపరచుట వలన ఆలస్యమైంది. ఆయన ఇంకనూ మాటలాడుచుండగా యాయిరు యింటి నుండి ఒకడు వచ్చి నీ కుమార్తె చనిపోయినది, బోధకుని శ్రమ పెట్టవద్దని (లూకా 8:9) చెప్పగా, ప్రభువు- భయపడవద్దు, నమ్మిక మాత్రముంచుము ఆమె స్వస్థపరచబడునని (లూకా8:50) చెప్పి తలిదండ్రులు, పేతురు యాకోబు, యోహాను తప్ప ఎవరినీ లోనికి రానియ్యక, ప్రభువు ఆ చిన్న దాని గదిలోనికి వెళ్లి చిన్నదాని చెయ్యిపట్టి తలీతాకుమీ అనగా ఆ చిన్నది లేచెను. ఆమెకు భోజనము పెట్టుడని ప్రభువు ఆజ్ఞాపించెను. అందరూ విస్మయమొందిరి.

ఈ అద్భుతములో లూకా వైద్యుడు ప్రభువు చిన్నదాని చెయ్యిపట్టుకొనెనని చెప్పాడు. అంటే శవాన్ని ముట్టాడు. ఇక్కడ ప్రభువు ప్రేమను వ్యక్తం చేశాడు. శవాన్ని ముట్టకుండ కూడ లేపగలడు కాని, ఆ చిన్నదాని శవాన్ని ముట్టి మరణములో మనతో వుంటాడని, మరణము ప్రభువును అపవిత్రపరచలేదని, ఆయన స్పర్శ మృతులను కూడ లేపగలదని యి అద్భుతం చాటుతుంది.

ప్రార్థన : యేసు ప్రభూ! లోకాచారాలను పట్టించుకోకుండా నీ ప్రేమను పంచుకోవడం నేర్పండి.

# ధర్మ రక్షణార్థమై పర్వతపు చెరియలలోకి



అబిసీనియా నుండి అవిశ్వాసులు అవమానపడి కోపముతో తిరిగి వచ్చిరి. దానికి తగినట్లు హ. ఉమర్ (రజి) కూడా అప్పుడే ఇస్లాము మతములో చేరి ఉన్నారు. ఆ వార్త వారిని మరింత మండింప చేసెను. వారు ఆ చింతయందే నిమగ్నమైన ఇట్లు ఆలోచింపసాగిరి. మనము ముస్లిములతో పరస్పరము కలుసుకొనుట, మాట్లాడుట మానుకోవలయును. ఏ విధముగానైన ఈ ఇస్లాము దీపమును ఆర్పవలయును. దాని కోసం వారు ఒక సమావేశమును జరిపి, అరబు సర్దారులందరు కలిసి తమలో తాము చర్చించుకొని యిట్లు నిశ్చయించిరి. ఇంక మనము సులభముగా మహమ్మదు సొల్లల్లాహు అలైహివసల్లమ్‌ను కత్తికి బలి చేయలేము. అది సాధ్యము కాని పని. ఎందుకనగా హాషిము వంశము గూడ గొప్ప బలసంపద గల ఉత్తమ వర్గము. వారు కూడ ఈ పనికి సమ్మతింపరు. అందువలన అవిశ్వాసులందరు గలిసి ఒక అసమ్మతి పత్రమును వ్రాసి అందులో కఠినమైన ఎన్నో ఆంక్షలను విధించి ఇట్లు ప్రకటించిరి. బనూహాషిము, బనూముత్తల్లిబుసంతతకి చెందిన వారందరిని ప్రతి ఒక్కరు బహిష్కరించవలయును, వారిని ఎవరుగాని తమ దగ్గర కూర్చుండనీయరాదు. వారితో కొనుటగాని, అమ్ముటగాని, అనగా క్రయ విక్రయాలు జరుపగూడదు, వారితో ఎవరు మాట్లాడరాదు, వారిని తమ ఇండ్లకు రానీయరాదు. వారి గృహములకు పోరాదు. హజరత్ ముహ్మదు సొల్లల్లాహు అలైహివసల్లమ్‌ని కాఫిరుల చేతికి సంహరించుటకు పట్టి ఇచ్చునంత వరకు ఈ ఆంక్ష వుండును అని కూడ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయము మాటలతోనే కాక లిఖిత రూపములో కూడా వ్రాసి కాబా మసీదుకు వ్రేలాడ గట్టారు. ఆ ప్రకటన చూచిన అవిశ్వాసులందరూ దానిలోని ఆంక్షలను పాటించి తీరవలయునని అందులో కోరారు. ఆ ఆంక్షల వలన హాషిము వంశీయులు మక్కా నగరమును విడిచి మూడేళ్ల వరకు రెండు పర్వతముల మధ్యలోని ఒక లోయలో, అవిశ్వాసుల దృష్టిలో పడకుండా వున్నారు. ఎవ్వరూ వారిని కలుసుకోలేదు. వారు గూడ ఎవరినీ కలవలేదు. వారు మక్కావాసుల ద్వారా ఏ వస్తువును కూడా కొనలేరు. బయటినుండి వచ్చు ఏ వ్యాపారిని కూడ కలవజాలరు. వారిలో ఎవరైన పొరపాటున బయటకు వచ్చినచో, కాఫిరులచే దెబ్బలు తినుచుండెను. ఎవరినైన తన అవసరమును తెలిపి సహాయము అడిగినచో, లేదు అని జవాబు దొరుకుచుండెను. వారి వద్దనున్న ఆహార ధాన్యములు ఖాళీ అయ్యెను. అటు తరువాత ఉపవాసములు చేయవలసి వచ్చేది. ఆడువారు, పసిపిల్లలు, ఆకలి బాధతో మూర్ఛిల్లుచుండిరి. ఏడ్చుచు, కేకలు పెట్టుచూ బాధ పడుచుండిరి. తమ ఆకలి కంటె తమ బిడ్డల ఆకలి వారి మనస్సులకు వర్ణించలేనంత బాధ కలిగించుచుండెను. చివరకు మూడేళ్ళ తరువాత అల్లాహ్ కృప వలన ఆ ఆంక్షల పత్రమును చెదలు తినివేసెను. దానితో, ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్‌ని, వారి వంశము వారికి ఆ బాధల నుండి విముక్తి కలిగెను వారి కష్టములు తొలిగెను. మూడేళ్ళ కాలము గ్రుడ్డి వారిలాగా ఏ విధముగా గడిపిరో ఆ మహానుభావులకే తెలియవలయును. ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్‌గారి అనుచరులు ఎన్ని కష్టములు అనుభవించినను ఇస్లాము ధర్మమును మాత్రము విడువలేదు. అట్లుండియు హజ్ యాత్ర కాలమునందు వారందరు పూజ్యుడు ఒక్కడే అతడే అల్లా అని ప్రచారము చేయుచుండెడి వాడు. నాటి వారి త్యాగము నిస్వార్థత, నిష్కాపరత, త్యాగనిరతి, సువర్ణాక్షరములతో వ్రాయదగినవి.

వివరణము:- ఎవరి పేర్లను మనము గౌరవ మర్యాదలతో ఉచ్చరించుచున్నామో, ఆ మహానుబావులు అట్టి కష్టములను అనుభవించిరి. మనము వారిని అనుసరించుచున్నాము. అయినను ఎప్పుడుగాని వారు చేసిన త్యాములను గురించి తెలుసుకొనలేదు. మనము మన ధర్మమగు ఇస్లామునకు ఏమి చేసితిమి? ఎంత వరకు చేసితిమి? అను విషయమును గురించి ఆలోచిపవలయును. కార్యములన్నియు మన ప్రయత్నమునకు తగునట్లే సాగును. ఇతరుల మార్గమున నడచి, మనము ఇస్లామును వృద్ధిచేయగలమా?

# ఆచరణయుత దేశభక్తి

స్వామి వివేకానంద 1886లో శ్రీరామకృష్ణుల నిర్యాణం తరువాత తన దేశ ప్రజల స్థితిగతులను స్వయంగా తెలుసుకుందామని భారత దేశమంతా పరివ్రాజకునిగా కాలినడకన తిరిగారు. ఆయన అనుభవం ఏమిటో ఆయన మాటలలోనే విందాం:

ఆచరణయుత దేశభక్తి అంటే ఒక ఆవేశపూరిత మనోభావమో, మాతృభూమి యోడల ప్రేమావేశమో కాదు. తోటి ప్రజలను సేవించాలనే ఆవేదనే దేశభక్తి అనబడుతుంది. నేను భారతదేశమంతా కాలి నడకన తిరిగి నా కనులతో స్వయంగా చూచింది - ప్రజల అజ్ఞానం అపరిశుభ్రత, శోక విచారాలు. వాటితో నా ఆత్మ జ్వలించింది. అటువంటి హీన పరిస్థితులను తొలగించాలనే ఉద్వేగమైన కోరిక నన్ను దహించింది. అది వారి కర్మ అని అనవద్దు. బాధపడటం వారి కర్మ అనేటట్లయితే వారి బాధలను తొలగించటం మన కర్మ. భగవంతుని చూడదలచుకుంటే మానవుని సేవించు. నారాయణుని చేరదలుచుకుంటే, భారతదేశంలో ఆకలితో పస్తులుండే లక్షలాది దరిద్ర నారాయణులని సేవించు!.

స్వామీజీ 1892వ సం॥ డిశంబరు 22వ తేదీన కన్యాకుమారి చేరారు. కాన్యకుమారి మాతను దేవాలయంలో అర్చించిన తరువాత, ఆయన సముద్రంలో ఈదుకుంటూ వెళ్ళారు. భారతదేశపు దక్షిణాగ్రాన ఉన్న శిలపై కూర్చొని ఆయన భారతదేశపు వర్తమానం, భవిష్యత్తుల పై తాద్ర ధ్యానమగ్నులైనారు. భారత దేశ పతనస్థితికి మూలకారణాన్ని ఆయన అన్వేషించారు. ఒక భవిష్య ద్రష్టగా భారతదేశం వైభవోపేతమైన స్థితి నుండి తీవ్రపనావస్థకు లోనై చిన్నాభిన్నమైన స్థితికి ఎందుకు చేరుకుందో అర్థం చేసుకున్నారు. భారతీయ ప్రజలు చేయవలినదాని గురించి, పొందవలసిన దాని గురించి ఆయన ఆలోచించారు. ఆయన ఒక బెంగాలు గురించో, మహారాష్ట్ర గురించో, పంజాబు గురించో కాక భారతదేశం గురించీ, భారతదేశపు ప్రాణం, జీవితం గురించి ఆలోచించారు. ఆయన కనుల ముందు దర్శనమిచ్చిన అనేక శతాబ్దాల భారతదేశ సాంస్కృతిక ఔన్నత్యపు శక్తిని ఆయన గ్రహించారు. అతి నైపుణ్యం గల వాస్తుశిల్పి తన నిర్మాణ ప్రణాళికను, సిమెంటుతో నిర్మించిన భవనాన్ని దర్శించే విధంగా ఆయన భారతదేశాన్ని ఒక క్రమబద్ధంగా, అవయవాలతో కూడినదిగా నిర్మాణాత్మకంగా దర్శించారు. భారతదేశంలోని లక్షలాది ప్రజలకు మతమే జీవనాడి అని ఆయన కనుగొన్నారు. తన హృదయాంతరాళపు నిశ్శబ్దతలో ఆయన ఈ విధంగా అనుకున్నారు. భారతదేశం మరల ఉద్ధరింపబడుతుంది. అయితే ఆ ఉద్ధరణ ఆమెని ఎల్లప్పుడూ జాతులన్నిటికీ, మతాలన్నిటికీ ఊయలగా చేసిన మహోన్నత ఆధ్యాత్మిక చైతన్య పునరుద్ధరణతోనూ, పునరుజ్జీవంతోనూ జరుగుతుంది. స్వామీజీ భారతదేశపు ఔన్నత్యాన్నీ, బలమీనతను గూడా దర్శించారు. ఆ బలమీనతలో అతి ముఖ్యమైనది జాతి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవ టమే! ఆయన మనస్సుకు తట్టిన ఒకే ఒక ఆశాభావం- సనాతన ఋషుల సంస్కృతిని పునరుద్ధరించటమే! అదే దీనికి సరైన పరిష్కార మార్గం అనిపించింది. భారతదేశ పతన స్థితికి మతం కారణం కాదు. ఎక్కడా నిజమైన మతం సరియైన అర్థంలో ఆచరించకపోవటమే ముఖ్యమైన పతన హేతువు. మతం నిజమైన అర్థంలో ఆచరించబడినపుడు అద్భుతమైన శక్తులలోకెల్లా శక్తిమంతం కాగలదు.



- మానవ ప్రతిభ నుంచి
(రామకృష్ణ మఠం ప్రచురణ)